


సమస్యలు పరిష్కరించాలని రైతుల వినతి


వినతి అందిస్తున్న నేతలు

గణపవరం: మండలంలో రైతుల సమస్యలు పరిష్కరించాలని, ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు సరఫరా చేయాలని కోరుతూ ఏపి రైతుసంఘం ఆధ్వర్యాన పిప్పర ఆర్‌బికె అధికారికి శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు మాట్లాడుతూ రైతులకు ప్రభుత్వం ఎరువులు సబ్సిడీపై సరఫరా చేస్తామని చెప్పినప్పటికీ ధర ఆకాశాన్నంటడం వల్ల ప్రయోజనం లేదని విమర్శించారు. కౌలుదారులకు భూయజమాని సంతకంతో సంబంధం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి గుత్తుల శ్రీను, నేతలు పి.నరసింహమూర్తి, సిఐటియు నేత పి.గోవింద్ పాల్గొన్నారు.

ఉద్యోగాల భర్తీలో

క్రీడా కోటాకు ఎసరు..!

విజేతలకు ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయమే
2023-28 క్రీడా పాలసీలో కసరత్తు
జిల్లాలో 50 వేల మంది క్రీడాకారుల్లో ఆందోళన
ప్రభుత్వ యోచనపై పెదవి విరుపు


క్రీడారంగంపై నీలినీడలు.. క్రీడాకారుల పరిస్థితి ప్రశ్నార్థకం

ప్రజాశక్తి - భీమవరం

ఉద్యోగాల భర్తీలో ఇప్పటి వరకు అమలు చేస్తున్న స్పోర్ట్స్ కోటాను రద్దు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మెడల్స్ సాధించిన వారికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు కల్పించడం ఆనవాయితీగా వస్తోంది. దీనివల్ల ఎంతోమంది ఆటగాళ్లకు క్రీడా కోటాలో పలు ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు పొంది పని చేస్తున్నారు. అయితే ఇకపై ఆ విధానం రద్దు చేసేందుకు ప్రభుత్వ ప్రయత్నాలు మొదలుపెట్టింది. ఈ నేపథ్యంలో క్రీడాకారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.

దేశ పేరు ప్రఖ్యాతులను ప్రపంచ దేశాల ముందు నిలపడంలో క్రీడారంగం ముఖ్య భూమిక పోషిస్తోంది. ఈ రంగంలో క్రీడాకారులు ఇతర దేశాలకు తలదన్నేలా రాణిస్తూ ప్రపంచం నలుమూలల కీర్తి ప్రతిష్టలను చాటుతున్నారు. దీనికి అనుగుణంగా ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహించడంతోపాటు ప్రభుత్వశాఖల్లో ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తూ వస్తోంది. జిల్లాలో సుమారు 50 వేల మంది క్రీడాకారులు ఉన్నారు. వివిధ క్రీడల్లో వీరు రాణిస్తున్నారు. ఇప్పటికే క్రీడల్లో రాణించిన వారు ఎంతోమంది ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు పొంది ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. అయితే ప్రభుత్వం క్రీడా పాలసీలో మార్పులు, చేర్పులపై కసరత్తు చేస్తోంది. దీనిలో భాగంగానే ఉద్యోగాల్లో క్రీడా కోటాను రద్దు చేసేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇప్పుడున్న క్రీడా విధానంలో మార్పులు చేసి క్రీడల్లో రాణించిన వారికి కేవలం ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం అందించి చేతులు దులుపుకునేలా కొత్తగా 2023-28 క్రీడా పాలసీని ప్రకటించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఇప్పటికే పలువురు అధికారులు, క్రీడా నిపుణులతో కూడా ప్రభుత్వం చర్చలు జరిపింది. ఇదే సమయంలో ఆటగాళ్లకు ఉద్యోగావకాశాలపైనా కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మెడల్స్ సాధించిన వారికి ఉద్యోగావకాశాలు కల్పించే విధానానికి స్వస్తి పలకాలని నిర్ణయించారు. రానున్న కాలంలో జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో మెడల్స్ సాధించిన వారికి కేవలం ప్రోత్సాహకాలు, ఆర్థిక సాయం మాత్రమే అందించాలని నిర్ణయించారు.

ఇప్పటి వరకు మెడల్స్ సాధించిన వారికి అనేక రాష్ట్రాల్లో గౌరవ సూచకంగా ఉద్యోగాలు ఇస్తున్నారు. ఆటగాళ్లకు ఉద్యోగావకాశాల్లోనూ ఎక్కువగా పోలీస్, రెవెన్యూ శాఖల్లో లభిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం కూడా గణనీయంగా రాణించిన వారికి సర్వీసెస్, రైల్వే వంటి వాటిలో ఉద్యోగావకాశాలు కల్పిస్తోంది. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం క్రీడల కోటాలో ఉద్యోగాలు రద్దు చేయడానికి అడుగులు వేస్తోంది. తాజాగా 'ఆడుదాం ఆంధ్రా' నిర్వహణ నేపథ్యంలో ఉన్నతాధికారుల కమిటీ నిర్వహిస్తున్న భేటీల్లో స్పోర్ట్స్ పాలసీపై కొంతమంది మాజీ సీనియర్ ఆటగాళ్ళ, క్రీడా నిపుణుల నుంచి సూచనలు వచ్చినట్లు ప్రచారం సాగుతోంది. ఈ నేపథ్యంలో క్రీడారంగం నిర్వీర్యమయ్యే అవకాశాలు ఉన్నట్లు క్రీడారంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ యోచనపై క్రీడాకారులు, క్రీడారంగ నిపుణులు పెదవి విరుస్తున్నారు. ప్రభుత్వ నిర్ణయం అమలైతే క్రీడాకారుల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారనుంది.

క్రీడారంగం, క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి



వి.వినీత్, కోచ్

క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా అనేది చాలా అవసరం. గ్రామీణ ప్రాంతాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే క్రీడాకారులు, మధ్యతరగతి విద్యార్థులకు క్రీడాకోటా ఎంతో ఉపయోగపడుతుంది. కేంద్ర ప్రభుత్వం 64 క్రీడలకు స్పోర్ట్స్ కోటాలో అవకాశం కల్పిస్తుండగా రాష్ట్రంలో కేవలం 30 క్రీడలకు మాత్రమే అవకాశం కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన జిఒలను రాష్ట్ర ప్రభుత్వం కూడా అమలు చేసి 64 క్రీడలకు వర్తింపజేసి స్పోర్ట్స్ కోటాను పెంచాలి. క్రీడారంగాన్ని, క్రీడాకారులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలి.

క్రీడాకోట మరింత చేరువ చేయాలి



జిఎన్‌విఎస్.విజయకుమార్, జాతీయస్థాయి క్రీడాకారుడు

ఏడో తరగతి నుండి నేను క్రీడలు ఆడుతున్నాను. నెట్‌బాల్, సాఫ్ట్‌బాల్‌లో ఇప్పటివరకు సుమారు 15 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. హర్యానా, కర్నాటకలో జాతీయస్థాయి పోటీల్లో ఆడాను. 2019-20 (కేరళ), 2021-22 (తమిళనాడు) ఆలిండియా యూనివర్సిటీ నేషనల్ పోటీల్లో పాల్గొన్నాను. పోలీస్ లేదా ఫిజికల్ డైరెక్టర్ కావాలనేది నా ఆశయం. స్పోర్ట్స్ కోటా వల్ల క్రీడాకారులు ఇప్పుడు కొంత లబ్ధి పొందుతున్నారు. ఈ క్రీడా కోటాను క్రీడాకారులకు మరింత చేరువ చేయాలి.

మాలాంటి క్రీడాకారులకు కోటా ఎంతో అవసరం



ఎం.పల్లవి, జాతీయస్థాయి క్రీడాకారిణి

ఇంటర్మీడియట్ స్థాయి నుండి నేను క్రీడలు ఆడటం మొదలుపెట్టాను. బేస్‌బాల్, నెట్‌బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. 2019 (పంజాబ్ రాష్ట్రంలో)లో జాతీయ స్థాయి పోటీల్లో, 2022-23లో హర్యానా రాష్ట్రంలో ఆలిండియా యూనివర్సిటీ జాతీయస్థాయి పోటీల్లో పాల్గొన్నాను. పిఇటి టీచర్ అవ్వాలనుకుంటున్నాను. స్పోర్ట్స్ కోటా ఉంటే మాలాంటి క్రీడాకారులు ఉద్యోగాలు సంపాదించుకోవడానికి అవకాశం ఉంటుంది.

ప్రభుత్వ నిర్ణయం సరైంది కాదు



డి.ప్రసన్నకుమార్, జాతీయస్థాయి క్రీడాకారుడు

వాలీబాల్, నెట్‌బాల్ క్రీడల్లో పలు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి ఆదిలాబాద్, వరంగల్, రంగారెడ్డి, వైజాగ్, తూర్పుగోదావరి, కృష్ణా జిల్లాల్లో పాల్గొన్నాను. ఢిల్లీలో జాతీయస్థాయి పోటీలు, 2019-20లో కేరళలో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీల్లో పాల్గొన్నాను. క్రీడాకోటాలో క్రీడాకారులకు న్యాయం చేయాలే తప్ప ఉన్నది రద్దు చేసే ప్రభుత్వ యోచన సరైంది కాదు.

ప్రభుత్వ ఉద్యోగంలో సేవ చేయాలనేది కోరిక



టి.జ్యోతిశ్రీ, జాతీయ స్థాయి క్రీడాకారిణి

సాఫ్ట్‌బాల్, బేస్‌బాల్, నెట్‌బాల్ క్రీడలు ఆడుతున్నాను. ఆలిండియా జాతీయస్థాయి యూనివర్సిటీ పోటీల్లో చండీఘర్, హర్యానా రాష్ట్రాల్లో ఆడాను. ప్రస్తుత పోటీ ప్రపంచంలో క్రీడాకారులకు ఉద్యోగాల్లో కోటాను పెంచాల్సిన అవసరం చాలా ఉంది. ప్రభుత్వ ఉద్యోగం సాధించి సేవ చేయాలనేది నా కోరిక.

క్రీడాకారులకు స్పోర్ట్స్ కోటా ఎంతో అవసరం



కెబిఎస్.అన్నవరంరెడ్డి, జాతీయస్థాయి క్రీడాకారుడు

బాస్కెట్‌బాల్, నెట్‌బాల్ క్రీడలు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. 2019-20లో జాతీయస్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాల్గొన్నాను. తమిళనాడు (2021-22), బెంగళూరు (2022-23)ల్లో జరిగిన ఆలిండియా యూనివర్సిటీ జాతీయస్థాయి పోటీల్లో రాణించాను. క్రీడలను మాత్రమే నమ్ముకున్న వారికి స్పోర్ట్స్ కోటా ఎంతో అవసరం. విద్య, ఉద్యోగాల్లో కొంతమందికైనా అవకాశాలు దక్కుతాయి.

కీచక వ్యాయామోపాధ్యాయుడు..!

విద్యార్థుల ఫిర్యాదుతో ఎస్‌ఎఫ్‌ఐ ఆందోళన
రంగంలోకి దిగి విచారించిన అధికారులు
సస్పెన్షన్‌కు కలెక్టర్‌కు సిఫార్సు: ఆర్‌డిఒ దాసి రాజు


విచారణ నిర్వహిస్తున్న అధికారులు

ప్రజాశక్తి - ఆకివీడు

ఆయనో వ్యాయామోపాధ్యాయుడు. పిల్లలను ఆటల్లో ప్రోత్సహించి తీర్చి దిద్దాల్సిన సదరు ప్రబుద్ధుడు తన విధులు పక్కన పెట్టి కీచకావతారం ఎత్తాడు. విద్యార్థినులపై లైంగిక వేధింపులకు పాల్పడటంతో వారంతా తల్లడిల్లారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో ఎస్‌ఎఫ్‌ఐ చేపట్టిన 'విద్యార్థి సంగ్రామ యాత్ర' వారికి ఆశాకిరణంలా కన్పించింది. యాత్ర శనివారం ఉదయం ఆ పాఠశాలను సందర్శించగా విద్యార్థినులంతా వ్యాయామోపాధ్యాయుని నిర్వాకంపై ఎస్‌ఎఫ్‌ఐ నేతల వద్ద ఒక్కసారిగా భోరుమన్నారు. దీంతో వెంటనే ఎస్‌ఎఫ్‌ఐ నేతలు అక్కడే ఆందోళన చేపట్టారు. వీరికి కొద్దిసేపటికి ప్రజాసంఘాల నేతలు తోడయ్యారు. ఈ విషయం తెలియగానే అధికారులు అప్రమత్తమై రంగంలోకి దిగి విచారణ చేపట్టగా విద్యార్థినుల ఆవేదన నిజమేనని తేలింది. దీంతో సదరు ప్రబుద్ధుడిని సస్పెండ్ చేయాలని కలెక్టర్‌కు నివేదిక సమర్పించారు. ఇవీ ఆకివీడులోని జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద శనివారం చోటుచేసుకున్న పరిణామాలు.

ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంగ్రామ యాత్ర శనివారం ఆకివీడు జెడ్‌పి హైస్కూల్‌కు చేరుకుంది. అక్కడ మధ్యాహ్న భోజన సమయంలో నేతలు విద్యార్థులను కలిసి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సమయంలో కొందరు విద్యార్థినులు తమను వ్యాయామోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని చెప్పడంతో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు కంగుతిన్నారు. వెంటనే వారు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ఆపై ఎంఇఒకూ ఎస్‌ఎఫ్‌ఐ నేతలు సమాచారమిచ్చారు. అయితే సంబంధిత ఉపాధ్యాయుడిని మందలిస్తానని ఎంఇఒ చెప్పడంతో నేతలు అవాక్కయ్యారు. దీనిపై ఎస్‌ఎఫ్‌ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు సిహెచ్.పావని తీవ్ర అభ్యంతరం, ఆగ్రహం వ్యక్తం చేశారు. పిఇటిపై చర్యలు మాని, వెనకేసుకు రావడం దారుణమని ఆందోళనకు దిగారు. ఈ విషయం తెలుసుకున్న ఆర్‌డిఒ దాసి రాజు, డిఇఒ వెంకటరమణ, స్త్రీశిశు సంక్షేమాధికారులు పాఠశాలకు చేరుకుని విద్యార్థినులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సుమారు ఐదు గంటలపాటు ఈ విచారణ సాగింది. తహశీల్దార్ విజయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు కృష్ణకుమారి, సుజాతారాణి విద్యార్థినులను విచారించి పిఇటి వెంకటేశ్వరరావు వేధింపులు నిజమేనని నిర్ధారించారు. దీనిపై నివేదిక కలెక్టర్‌కు అందజేసి సస్పెన్షన్‌కు సిఫార్సు చేస్తామని ఆర్‌డిఒ దాసి రాజు తెలిపారు. దీంతో ఎస్‌ఎఫ్‌ఐ నేతలు ఆందోళన విరమించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి.వాసు, డి.పెద్దిరాజు, జిల్లా ఉపాధ్యక్షులు టి.ప్రసాద్, ఎమ్‌డి.జాన్, నాయకులు పి.నాగేంద్రబాబు, బి.గణేష్, కె.నవీన్, టి.దుర్గారావు, శ్రీనుబాబు, చిరంజీవి, నాని పాల్గొన్నారు.

17 నుండి గుంటూరు ఎక్స్‌ప్రెస్ పున: ప్రారంభం

ఆకివీడు: గతంలో నర్సాపూర్ పాస్ట్ ప్యాసింజర్ పేరుతో నడిచిన గుంటూరు రైలు కరోనా అనంతరం ఎక్స్‌ప్రెస్‌గా మారిన సంగతి తెలిసిందే. ఈ రైలును ఈ నెల 17 నుంచి పున: ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారని నరసాపురం ఎంపీ రఘురామకృష్ణంరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ట్రాక్ మరమ్మతుల పేరిట జూన్ 19వ తేదీ నుంచి ఈ రైలును రైల్వే అధికారులు రద్దు చేసిన సంగతి తెలిసిందే. దీంతో డెల్టా వాసులు విజయవాడ వెళ్లేందుకు నానావస్థలు పడుతున్నారు. దీంతో ఎంపీ రఘురామకృష్ణంరాజు డిఆర్ఎంకు లేఖ రాశారు. దీంతో ఈ నెల 17 నుంచి నరసాపురం-విజయవాడ మధ్య రైలును పునరుద్ధరించాలని, ట్రాక్ మరమ్మతుల అనంతరం గుంటూరు వరకూ పొడిగించాలని రైల్వే అధికారులు నిర్ణయించారు. ఈ రైలు నరసాపురంలో ఉదయం 6.05 గంటలకు బయల్దేరనుంది.



నినదిస్తున్న నేతలు

ధరల నియంత్రణలో ప్రభుత్వాలు విఫలం

సిపిఎం ఆధ్వర్యాన లంకపేటలో ధర్నా

ప్రజాశక్తి - భీమవరం

పెరుగుతున్న ధరలను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఎం పట్టణ కార్యదర్శి బి.వాసుదేవరావు విమర్శించారు. శనివారం స్థానిక 38వ వార్డు లంకపేటలో పెరుగుతున్న ధరలు అరికట్టాలని, పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించాలని, పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వాసుదేవరావు మాట్లాడుతూ టమాటా కిలో రూ.130, బీరకాయలు కిలో రూ.80, అల్లం కిలో రూ.400, వంకాయలు రూ.100, చిక్కుడుకాయలు రూ.160కి పెరిగాయన్నారు. మరోపక్క గ్యాస్, పెట్రోల్, డీజిల్, కరెంట్ ఛార్జీలు పెంచి కేంద్రంలో మోడీ, రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వాలు ప్రజల నడ్డి విరుస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుబజార్ల ద్వారా ప్రజలకు సబ్సిడీపై కూరగాయలు, పప్పులు, నిత్యావసర వస్తువులు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ప్రభుత్వాలు ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ ధర్నాలో సిపిఎం నాయకులు ఎం.వైకుంఠరావు, డి.త్రిమూర్తులు, కె.సాయమ్మ, కుమారి, జె.శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రతిఒక్కరికీ కంటి వైద్యం అందించాలి

డిఎంహెచ్ఒ మహేశ్వరరావు

ప్రజాశక్తి - భీమవరం

కంటి వెలుగు కార్యక్రమం ద్వారా గ్రామాల్లో ఉన్న అర్హులైన ప్రతిఒక్కరికీ కంటి వైద్యం అందించి వారికి ఉచితంగా మందులు అందించాలని డిఎంహెచ్ఒ డాక్టర్ మహేశ్వరరావు వైద్య సిబ్బందికి సూచించారు. గొల్లలకోడేరు సబ్‌సెంటర్లో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా డిఎంహెచ్ఒ మాట్లాడుతూ కంటి వైద్యంతోపాటు గ్రామంలో ప్రతిఒక్కరికీ ఎక్కువ వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాకాలంలో తాగునీటి విషయంలో పలు జాగ్రత్తలు పాటించాలని, ఎప్పటికప్పుడు వాటర్ ట్యాంక్ వద్ద క్లోరినేషన్ టెస్టులు చేస్తూ తాగునీటి పరిస్థితిని గమనించాలని సూచించారు. మురుగునీరు నిల్వ ఉండకుండా దోమల ఉధృతిని తగ్గించేలా దోమల మందును పిచికారీ చేయించాలన్నారు. కంటి వెలుగు కార్యక్రమాన్ని అప్తాల్మిక్ అసిస్టెంట్ పి.కాంచన ప్రియ 150 మందికి కంటి పరీక్షలు చేసి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ సిహెచ్‌వి.రంగమనాయుడు, సిహెచ్‌వి.సత్యనారాయణ, సూపర్‌వైజర్లు శ్రీనివాస్, నాగమణి, ఎంఎల్‌హెచ్‌పి వల్లి, ఎఎన్‌ఎం కనకకుమారి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అమర్‌నాథ్ వెళ్లిన తాడేపల్లిగూడెం యాత్రికుడు మృతి


ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం


రఘునాధరావు (ఫైల్)

పట్టణానికి చెందిన వ్యక్తి అమర్‌నాథ్ యాత్రకు వెళ్లి మార్గమధ్యంలో అనారోగ్యంతో మృతి చెందిన ఘటన శనివారం ఉదయం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి తహశీల్దార్ వై.దుర్గాకిషోర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక 17వ వార్డుకు చెందిన తునుగుంట్ల రఘునాధరావు ఈ నెల నాలుగో తేదీన స్నేహితులతో కలిసి అమర్‌నాథ్ యాత్రకు వెళ్లారు. దర్శనం ముగించుకుని తిరిగొస్తున్న తరుణంలో ఈ నెల 13న రఘునాధరావు అస్వస్థతకు గురయ్యారు. దీంతో సహచరులు హుటాహుటీన ఆయనను జమ్మూలోని ఆసుపత్రిలో చేర్చారు. రఘునాధరావు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి శనివారం తెల్లవారుజామున మృతి చెందినట్లు సమాచారం అందిందని తహశీల్దార్ దుర్గాకిషోర్ తెలిపారు. ప్రస్తుతం మృతదేహం చండీఘడ్‌లో ఉందన్నారు. డిప్యూటీ సిఎం కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు కలెక్టర్ ప్రశాంతి మృతదేహాన్ని రప్పించేందుకు ఢిల్లీలోని ఉన్నతాధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. రఘునాధ్‌రావు మృతదేహం ఢిల్లీ తీసుకొచ్చి అక్కడ నుంచి విజయవాడ మీదుగా తాడేపల్లిగూడెం వస్తుందని తెలిపారు. మృతునికి భార్య, వివాహమైన కుమార్తె ఉన్నారు.

సంతృప్తికర స్థాయిలో పరిష్కారమే జగనన్న సురక్ష

ప్రజాశక్తి - భీమవరం రూరల్


ధ్రువీకరణ పత్రం అందిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

సంక్షేమ పథకాలు, ప్రజాసమస్యలు సంతృప్తికర స్థాయిలో పరిష్కారమే లక్ష్యంగా జగనన్న సురక్ష ప్రత్యేక క్యాంపులు విజయవంతంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. శనివారం భీమవరం మండలం నాగిడిపాలెంలో నిర్వహించిన 'జగనన్న సురక్ష' ప్రత్యేక క్యాంపులో కలెక్టర్ పాల్గొన్నారు. హెల్ప్‌డెస్క్‌లు తదితర ఏర్పాట్లను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ అర్హులై ఉండి ఏఒక్కరూ లబ్ధి అందకుండా మిగిలిపోకూడదనే తపనతో, ఇంట్లో ఏ చిన్న సమస్య ఉన్నా దానిని పరిష్కరించాలనే చిత్తశుద్ధితో జగనన్న సురక్ష కార్యక్రమం రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిందన్నారు. అర్హులై ఉండి ఎక్కడైనా లబ్ధి అందని వారుంటే వారిని గుర్తించి సమస్య పరిష్కారానికి కావాల్సిన పత్రాలు సేకరించి, దరఖాస్తులను సచివాలయానికి తీసుకెళ్లి వాటిని అక్కడ సమర్పిస్తారని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు కాండ్రేగుల నరసింహారావు, ఎంపిపి పేరిచర్ల విజయ నరసింహారాజు, ఎంపిడిఒ కె.వెంకటలక్ష్మి, డిప్యూటీ తహశీల్దార్ గ్రంధి పవన్, మాజీ ఎఎంసి ఛైర్మన్ తిరుమాని ఏడుకొండలు, సర్పంచి నాగిడి దుర్గాభవాని, గ్రామ సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

అలజడి..!

పులిరామన్నగూడెం గిరిజన సంక్షేమ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి హత్య.. కైకలూరు నియోజకవర్గంలో అనుమతుల్లేకుండా యథేచ్ఛగా చెరువుల తవ్వకం, అంగన్వాడీల 36 గంటల నిరవధిక ధర్నా, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి రెండో దశ యాత్ర ఉమ్మడి జిల్లాలో అలజడి సృష్టించాయి.

బుట్టాయగూడెం మండలం పులిరామన్నగూడెంలోని గిరిజన సంక్షేమ పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి హత్య హాస్టళ్లలో వసతులను, భద్రతను తెరపైకి తీసుకొచ్చింది. పదో తరగతి విద్యార్థులే ఈ విద్యార్థిని హత్య చేసినట్లు పోలీసులు ప్రకటించినా సమస్య మాత్రం సద్దుమణగలేదు. ఇద్దరు సీనియర్ విద్యార్థులు నాలుగో తరగతి విదార్థిని పకడ్బందీగా ప్రణాళిక ప్రకారం హత్య చేసేంత కారణాలేమిటీ, ఈ హత్యా ఘటనలో ఇతరుల ప్రమేయం ఏమీ లేదా?, వీరి ప్రవర్తనపై అటు వార్డెన్, ఇటు పాఠశాల సిబ్బందికి ఎవరికీ అనుమానం రాలేదా..? సహచర విద్యార్థులు ఎప్పుడూ ఫిర్యాదు చేయలేదా? వంటి ఎన్నో ప్రశ్నలకు సమాధానాలు లేకుండాపోయాయి. గతంలో జీలుగుమిల్లి మండలం దాట్లవారిగూడెంలో వాల్మీకి విజ్ఞాన కేంద్రంలో విద్యార్థిని అనుమానాస్పద మృతి కేసును తర్వాత అటకెక్కించేశారు. ఈ తరహాలో గత పదేళ్లలో కెఆర్‌పురం ఐటిడిఎ పరిధిలో ఐదుగురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. ఇవన్నీ వెలుగులోకి వచ్చినవే. రానివి ఎన్నో ఉన్నాయనే ప్రచారం కూడా ఉంది. ఇప్పటికైనా ఐటిడిఎ పరిధిలోని వసతి గృహాలన్నింటిపైనా పర్యవేక్షణ పెంచడంతోపాటు విద్యార్థుల సంక్షేమం, భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని ఈ ఘటనలు చెప్పకనే చెబుతున్నాయి. ఘటన జరిగినప్పుడు హడావుడికన్నా అసలు జరగకుండా తీసుకోవాల్సిన చర్యలపై పులిరామన్నగూడెం ఘటనను ఆధారంగా తీసుకుని ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని గిరిపుత్రులు కోరుతున్నారు.



ఆక్వా చెరువుల తవ్వకం జిల్లాలో మళ్లీ అలజడి సృష్టిస్తోంది. సారవంతమైన భూముల దగ్గర నుంచి నివాస ప్రాంతాలను దెబ్బతీసే వరకూ చేరుకున్న చెరువుల తవ్వకం తాజాగా తాగునీటి చెరువులను సైతం ధ్వంసం చేసేలా చేపట్టడం చర్చనీయాంశం కావడంతోపాటు ఆందోళన రేకెత్తిస్తోంది. ఈ పరిస్థితి ప్రస్తుతం కైకలూరు నియోజకవర్గంలో ఎక్కువగా ఉంది. అధికార పార్టీ ప్రజాప్రతినిధులే ఈ చెరువుల తవ్వకం వెనుక ఉండి నడిపిస్తుండటంతో అధికారులు సైతం ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారని ప్రచారం సాగుతోంది. కనీసం కోర్టు ఆదేశాలతో తవ్వుతున్నారని చెబుతున్నా.. ఆ ఆదేశాలు నిజంగా ఉన్నాయో లేదో మండలస్థాయి అధికారి చెప్పలేకపోవడం, జిల్లాస్థాయి అధికారులకు ఎటువంటి సమాచారమూ లేకపోవడం అధికార యంత్రాంగ నిస్సహాయతకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు. కలిదిండి మండలంలో తాగునీటి చెరువు పక్కనే ఆక్వా చెరువు తవ్వకానికి బరితెగించారంటే ఎవరి అండ ఉందో అర్థం చేసుకోవచ్చు. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అధికారులు సైతం క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లకుండానే చెరువుల తవ్వకాలకు అనుమతులిచ్చేస్తున్నారనే విమర్శలున్నాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టిసారించి కనీసం మనిషి జీవించడానికి అవసరమైన తాగునీరు, నివాసం వంటి వాటినైనా ఆక్వా చెరువుల తవ్వకాలతో ధ్వంసం చేయకుండా అడ్డుకట్ట వేయాలని అంతా కోరుతున్నారు.

అంగన్వాడీలు మరోసారి తమ పోరాట పటిమ చూపి అందరికీ ఆదర్శంగా నిలవడంతోపాటు భవిష్యత్తు పోరాటాలకు స్ఫూర్తి నింపారు. గతంలో ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ 36 గంటల నిరవధిక ధర్నా చేపట్టిన వెంటనే స్పందించాల్సిన ప్రభుత్వం, జిల్లా అధికారులు సైతం మౌనం వహించడం చర్చనీయాంశమైంది. రెండో రోజు అంగన్‌వాడీలు కదంతొక్కుతూ కలెక్టరేట్ల వైపు దూసుకెళ్తుంటే పోలీసులతో అడ్డుకునే ప్రయత్నం తప్ప సమస్యలు తెలుసుకునే ప్రయత్నం జిల్లా అధికారులు చేయకపోవడం విస్మయం కల్గిస్తోంది. భీమవరంలో అయితే పోలీసుల దురుసు ప్రవర్తనతో పలువురు గాయాలతో ఆస్పత్రుల పాలయ్యారు. అయినా పట్టువీడక కలెక్టరేట్ వద్దకు చేరుకుని అధికారులు దిగొచ్చేలా చేసిన అంగన్‌వాడీల పోరాట పటిమ ప్రశంసనీయం. ఢిల్లీ రైతు పోరు, తాజాగా అంగన్‌వాడీల పోరు భవిష్యత్తు పోరాటాలకు దిక్సూచిగా ఉంటాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు.

జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వారాహి రెండో దశ యాత్ర ఉమ్మడి జిల్లాలో ఆరు రోజులపాటు సాగింది. మొదటి దశ యాత్రకన్నా రెండో దశ యాత్రలో పవన్ ప్రసంగాలు అలజడి సృష్టించాయని చెప్పొచ్చు. వాలంటీర్ల డేటా సేకరణ, స్థానికాంశాలతోపాటు తణుకులో చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి. పవన్ వ్యాఖ్యలకు నిరసనగా ఇటు వాలంటీర్లు, అటు వైసిపి శ్రేణులు నిరసనలు చేపట్టి దిష్టిబొమ్మల దహనం వంటి చర్యలకు పాల్పడగా, జనసేన శ్రేణులు వాటిని తప్పుబడుతూ పవన్ చిత్రపటాలకు పాలాభిషేకాలు పోటాపోటీగా నిర్వహించారు. ఈ అంశాలన్నీ ఇలా ఉండగా తణుకులో అన్నవరంలో అర్చకుల వేలం పాట గూర్చి ప్రస్తావిస్తూ ఇతర మతాల్లో ఇలా చేస్తారా అంటూ పవన్ ప్రశ్నించడం కలకలం సృష్టించింది. పవన్ జనసేనానిలా కాకుండా తన మిత్రులైన కాషాయదళ నేతలా మాట్లాడారనే విమర్శలు విన్పిస్తున్నాయి. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో వారాహి రెండో దశ యాత్ర కొంత అలజడి సృష్టించాయనడంలో ఎటువంటి సందేహమూ లేదు. రానున్న రోజుల్లో జిల్లా రాజకీయాల్లో మార్పులకు, జనసేనకు ఈ యాత్ర ఎంత వరకూ దోహదపడుతుందో వేచిచూడాలి.

-విఎస్ఎస్‌వి.ప్రసాద్


ప్రతాప్‌కుమార్‌కు వినతిపత్రం అందిస్తున్న సిహెచ్.లక్ష్మి

ఆశాలపై పనిభారం తగ్గించాలి

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

ఆశాలపై పని భారం తగ్గించాలని ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు సిహెచ్.లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె లంకలకోడేరు ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ అడ్డాల ప్రతాప్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఆశాలతో సంబంధం లేని పనులు చేయిస్తున్నారని, ఆన్‌లైన్ వర్క్ తగ్గించాలని, ప్రభుత్వ సెలవులు, మెడికల్ లీవులు మంజూరు చేయాలని, ప్రయాణ ఖర్చులు ఇవ్వాలని, ప్రతి ఒక్కరికీ గ్రూప్ ఇన్సూరెన్స్ రూ.పది లక్షలు కల్పించాలని ఆమె కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఆశాలు శిరోమణి, విజయదుర్గ, డి.దానేశ్వరి ఉన్నారు.

అనారోగ్యంతో మాజీ ఎంపిపి జయలక్ష్మి మృతి

ప్రజాశక్తి - ఉండి

ఉండి మాజీ ఎంపిపి గడి జయలక్ష్మి (65) శనివారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. గడి జయలక్ష్మి మృతదేహానికి పలువురు గ్రామ ప్రముఖులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆమె కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం పలువురు మాట్లాడుతూ చంద్రబాబునాయుడు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసిన కాలంలో మండలం నుంచి డ్వాక్రా గ్రూపులో చేరిన మొట్టమొదటి మహిళ గడి జయలక్ష్మి అని చెప్పారు. ఎంతోమంది మహిళలకు టైలరింగ్ నేర్పి జీవనోపాధిని ఇచ్చారన్నారు. గడి జయలక్ష్మికి ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ

ప్రజాశక్తి - ఉండి

పుట్టగొడుగుల పెంపకంపై నేటి నుంచి మూడు రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.మల్లికార్జునరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయ పరిశోధన మండలి స్థాపించి 95 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా కృషి విజ్ఞాన కేంద్రంలో సాంకేతిక ప్రదర్శన, పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి కలవారు కృషి విజ్ఞాన కేంద్రంలో సంప్రదించాలని ఆయన కోరారు.

పారిశుధ్య మెరుగుకు కృషి

ప్రజాశక్తి - ఉండి

గ్రామంలో నెలకొన్న పారిశుధ్య సమస్యను అధిగమించేందుకు తమ వంతు కృషి చేస్తామని మండలంలోని పెదపుల్లేరు గ్రామ సర్పంచి కరణం పార్వతి వెంకటేశ్వరరావు అన్నారు. గ్రామంలోని మండల పరిషత్ ఉన్నత పాఠశాల ఎదురుగా ఉన్న డ్రెయినేజీ పైపులైన్ పగిలిపోయి నీరు రోడ్ల మీదకు చేరడంతో ఆ నీటి నుంచి వచ్చే దుర్వాసనతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు సర్పంచి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన సర్పంచి, పంచాయతీ కార్యదర్శి శివాజీ పొక్లెయిన్ సాయంతో పైపులైను పగిలిన భాగంలో కొత్త పైపు అమర్చారు. సమస్య పరిష్కారానికి స్పందించిన సర్పంచి, కార్యదర్శులకు స్థానికులు అభినందనలు తెలిపారు.

ఛాంబర్ కళాశాలలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు ఛాంబర్ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించే మెగా జాబ్‌మేళాను ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు శనివారం ప్రారంభించారు. ఈ జాబ్‌మేళాలో 18 కంపెనీల్లో 750 ఖాళీలను భర్తీ చేయనున్నారు. జాబ్ మేళాకు గోదావరి జిల్లాలతో పాటు కోనసీమ జిల్లా నుంచి కూడా భారీగా అభ్యర్థులు తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ నిమ్మల మాట్లాడుతూ ఉభయ గోదావరి జిల్లాలోనే తక్కువ ఫీజుతో నాణ్యమైన విద్య అందిస్తూ ఇటువంటి మెగా జాబ్‌మేళా నిర్వహించడం పట్ల మేనేజ్‌మెంట్‌ను అభినందించారు.

'ప్రతిపక్షాల హామీలు నమ్మొద్దు'

ప్రజాశక్తి - పాలకోడేరు

అబద్ధపు హామీలతో ఇళ్లకు వచ్చే ప్రతిపక్ష పార్టీలను నమ్మవద్దని డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ సమన్వయకర్త పివిఎల్.నరసింహరాజు అన్నారు. విస్సాకోడేరు సర్పంచి బొల్లా శ్రీనివాస్ ఆధ్వర్యంలో గ్రామంలో శనివారం నిర్వహించిన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. 2014 ఎన్నికల్లో 600 హామీలతో అధికారంలోకొచ్చిన చంద్రబాబు ప్రజలను నిలువునా మోసం చేసిన విషయాన్ని మర్చిపోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెన్మెత్స శ్రీనివాసరాజు, దుండి అశోక్‌బాబు పాల్గొన్నారు.

ఆకివీడు ఇన్‌ఛార్జి ఎస్ఐగా సత్యసాయి

ప్రజాశక్తి - ఆకివీడు

ఆకివీడు ఇన్‌ఛార్జి ఎస్ఐగా ఆర్.సత్యసాయి బాధ్యతలు స్వీకరించారు. సుమారు వారం రోజులుగా ఈ స్థానం ఖాళీగా ఉంది. వారం రోజుల క్రితం వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేసిన కె.రాజారెడ్డి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో విఆర్‌లో ఉన్న సత్యసాయిని ఇన్‌ఛార్జి ఎస్ఐగా నియమించారు.

నేడు రోటరీ కార్యవర్గం ప్రమాణం

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు రోటరీ క్లబ్‌కు 2023-24 సంవత్సరానికి నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార మహోత్సవం ఆదివారం నిర్వహించనున్నారు. కొత్త కార్యవర్గం ఒక సంవత్సరం పాటు రోటరీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యవర్గంలో ప్రెసిడెంట్‌గా పెనుమాక రామ్మోహన్, సెక్రటరీగా రావాడ సతీష్, ట్రెజరర్‌గా ముత్యాల శ్రీవాత్సవ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం సాయంత్రం ఆరు గంటలకు, పాలకొల్లు లయన్స్ కమ్యూనిటీ హాల్‌లో ప్రమాణ స్వీకారం చేస్తారు. ఈ కార్యక్రమానికి ఇన్సులేషన్ ఆఫీసర్‌గా రోటరీ డిజిఎన్ యల్లూరి కళ్యాణ చక్రవర్తి వ్యవహరిస్తారు. ముఖ్య అతిథిలుగా డాక్టర్ సిహెచ్.సత్యనారాయణమూర్తి, ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు, ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ రాజేష్ పాల్గొంటారు.

'అసంబద్ధంగా పవన్‌కల్యాణ్ ప్రసంగం'

ప్రజాశక్తి - తణుకు

జనసేన అధినేత పవన్‌కల్యాణ్ వారాహి యాత్రలో ప్రసంగం అసంబద్ధంగా, అసత్యంగా ఉందని ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ అన్నారు. సజ్జాపురంలోని స్థానిక వైసిపి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాలంటీర్ వ్యవస్థను కించపరిచేలా పవన్ మాట్లాడడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. పవన్ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని, ప్రజలను అయోమయానికి గురి చేయకూడదని చెప్పారు. ఈ సమావేశంలో వైసిపి నాయకులు చిట్టూరి శ్రీ వెంకటసుబ్బారావు, మంగిన సూర్య, పైబోయిన ఏసుబాబు, మొలగాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

భార్య, కుమార్తె కనిపించడంలేదని ఫిర్యాదు

ప్రజాశక్తి - పాలకొల్లు రూరల్

మండలంలోని చింతపర్రు గ్రామానికి చెందిన గూడవల్లి చంద్రశేఖర్ తన భార్య, కుమార్తె కనిపించడం లేదని పాలకొల్లు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గూడవల్లి దుర్గాభవాని, బిందుహర్షిని ఈ నెల పదో తేదీ నుంచి కనిపించడం లేదని, తెలిసిన అన్ని ప్రాంతాల్లో, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభ్యం కాలేదని చంద్రశేఖర్‌శ్రీనివాస్ స్థానిక పాలకొల్లు రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ తెలిపారు.


వేధింపులపై కేసు

ప్రజాశక్తి - ఉండి

తన దగ్గర ఉన్న డబ్బు, బంగారం ఇవ్వాలని తన భర్త, కుమారుడు వేధిస్తూ నిత్యం చిత్రహింసకు గురి చేస్తున్నారని మండలంలోని మహదేవపట్నం గ్రామానికి చెందిన వీరవల్లి అనసూయ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు అనసూయ భర్త వెంకటేశ్వరరావు, కుమారుడు బాలాజీపై ఉండి ఎస్ఐ కె.గంగాధరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

తక్కువ ధరకు నాణ్యమైన సరుకులు

రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి



తణుకులో బియ్యం ప్రత్యేక కౌంటర్ ప్రారంభిస్తున్న మంత్రి

ప్రజాశక్తి - తణుకు

రాష్ట్రమంతటా నాణ్యమైన బియ్యం, కందిపప్పు నిర్దేశిత ధరలకే ట్రేడర్స్ ద్వారా అమ్మకాలు చర్యలు తీసుకున్నామని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. శనివారం పట్టణంలోని అర్వపల్లి కళ్యాణ మండపం ఎదురుగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుకాణంలో బియ్యం ప్రత్యేక కౌంటర్‌ను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బియ్యం, కందిపప్పు ధరలు ఎక్కువగా ఉండటంతో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు రైస్ ట్రేడర్స్ అందరితో సమావేశం ఏర్పాటు చేసి నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు ప్రజలకు అందించడానికి చర్యలు తీసుకున్నామన్నారు. దీనిలో భాగంగానే రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి బియ్యం అమ్మకాలు ప్రారంభించారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో ట్రేడర్స్ అందించిన సహాయ సహకారాలు మర్చిపోలేమన్నారు. కందిపప్పును కూడా నాలుగైదు రోజుల్లో ఒక రేటు నిర్ణయించి అమ్మే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ టి.శివరాం, పసాద్, డిఎస్ఒ ఎన్.సరోజ, ఎఎస్ఒ రవిశంకర్, తహశీల్దార్ పివిఎస్.ప్రసాద్, మాజీ ప్రసాద్, ట్రేడర్స్ ప్రతినిధులు ఎంవి.ముత్యాలరావు, ధనుంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఉండి :ప్రభుత్వం ద్వారా తక్కువ రేట్లకే నాణ్యమైన బియ్యాన్ని అందించడం ద్వారా బహిరంగ మార్కెట్‌లోని బియ్యం ధరలకు కళ్లెం వేయవచ్చని ఉండి మండల ప్రత్యేక అధికారి ఎం.రవికుమార్ అన్నారు. ఉండి కో-ఆపరేటివ్ సొసైటీ గోడౌన్‌లో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక బియ్యం కౌంటర్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎం.రవికుమార్ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో రాష్ట్ర ప్రభుత్వం వాటికి కళ్లెం వేసేందుకు పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బియ్యం కౌంటర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనంతరం ఇన్‌ఛార్జి తహశీల్దార్ ఎస్.వీరస్వామినాయుడు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల శాఖ డిప్యూటీ తహశీల్దార్ మోరంపూడి మహేష్ కుమార్, పాములపర్రు గ్రామ రెవెన్యూ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

పెరుగులంక బాధితులకు ఆర్థిక సాయం


బాధితులకు ఆర్థిక సాయం అందిస్తున్న ఎంఎల్ఎ నిమ్మల

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామంలో పెరుగులంక భూముల కోసం పోరాటం చేసి పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంటి వద్ద ఉంటున్న రాపాక బొజ్జమ్మ, పల్లేరు శ్రీనివాస్, ముసుకూడి రాజు, కేత వాసులకు టిడిపి అధినేత చంద్రబాబు ఆదేశాల మేరకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున మొత్తం రూ.లక్ష పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు చేతులమీదుగా అందించారు. ఈ సందర్భంగా రామానాయుడు మాట్లాడుతూ అనేక ఏళ్లుగా పేదల ఆధీనంలో ఉన్న పెరుగులంక భూముల్లోని మట్టిని వైసిపి నాయకులు అక్రమంగా తరలించుకుపోవడాన్ని చించినాడ గ్రామంలోని పేదలంతా అడ్డుకున్నారన్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల దమన కాండలో అనేకమంది గాయపడ్డారని గుర్తు చేశారు. ఎవరైతే గాయపడి పోలీసుల కేసులు ఎదుర్కొంటున్నారో వారందరికీ రానున్న టిడిపి ప్రభుత్వం హయాంలో ఆర్థికంగా ఆదుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి అంగర రామ్మోహన్‌రావు, టిడిపి నాయకులు పెచ్చెట్టి బాబు, రత్నం రాజు, చిట్టూరి రామాంజనేయులు, పీతల శ్రీనివాస్, కొండేటి నరేష్, కొండేటి జీవరత్నం పాల్గొన్నారు.

కమ్యూనిస్టుల నిబద్ధత పలువురికి ఆదర్శం

కమ్యూనిస్టులు ప్రజా సమస్యలపై ఎంత నిబద్ధతతో పనిచేస్తారో చించినాడ పోరాటంలో తాను ప్రత్యక్షంగా చూశానని పాలకొల్లు ఎంఎల్ఎ నిమ్మల రామానాయుడు అన్నారు. సాధారణ ప్రజలతో పాటు సిపిఎం గ్రామ ముఖ్య నాయకులు పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడ్డారన్నారు. వారందరికీ వాస్తవంగా ఆర్థిక సాయం చేయడానికి తమ అధినేత చంద్రబాబు ఆదేశించారని, కాని ప్రజల కోసం కుటుంబాలను సైతం పక్కనపెట్టి ప్రాణాలను పణంగా పెట్టి పోరాటం చేసే కమ్యూనిస్టు నాయకులు తమకు డబ్బులు ముఖ్యం కాదని, కేవలం ప్రజా సమస్యలు పరిష్కారమైతే సరిపోతుందని చెప్పి తాము ఆర్థిక సాయం చేయడానికి ముందుకు వచ్చినా వారు మాత్రం సున్నితంగా తిరస్కరించారని చెప్పారు. కమ్యూనిస్టుల పట్ల ప్రజల్లో మంచి గుర్తింపు, గౌరవభావం పొందడానికి ఇదే నిదర్శనమన్నారు.

ఎస్‌సి బాలుర హాస్టల్లో విచారణ

ప్రజాశక్తి - కాళ్ల

కాళ్ల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహంలో వంట మనిషిగా పని చేస్తున్న ఎం.వెంకటేశ్వర్లు హాస్టల్ విద్యార్థి కె.తేజను కొట్టిన ఘటనపై జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ, సాధికారత అధికారి కె.శోభారాణి శనివారం విచారణ చేపట్టారు. వంట మనిషి వెంకటేశ్వర్లును విచారించారు. హాస్టల్ వంట మనిషిపై క్రమశిక్షణ చర్యల కోసం ఉన్నతాధికారులకు సిఫార్సు చేసినట్లు తెలిపారు. ఈ సంఘటన విషయం ఆలస్యంగా నివేదించిన భీమవరం సహాయ సాంఘిక సంక్షేమ అధికారిపై చర్యలు తీసుకునేందుకు సిఫార్సులు చేశామని తెలిపారు.

స్వచ్ఛ సర్వేక్షన్‌పై ప్రత్యేక దృష్టి : కలెక్టర్

భీమవరం :స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్-2023పై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి.ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లో స్వచ్ఛ సర్వేక్షన్ గ్రామీణ్, జగనన్న సురక్షపై కలెక్టర్ అధికారులతో సమీక్షించారు. కార్యాచరణ రూపొందించి గ్రామపంచాయతీలవారీగా లక్ష్యాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. జగనన్న సురక్ష శిబిరంలో తప్పనిసరిగా సర్వీస్ రిక్వెస్ట్‌లను రిజిస్టర్ చేయాలన్నారు. జనన, మరణ ధ్రువీకరణ పత్రాల జారీలో శ్రద్ధ వహించాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి, డిఆర్ఒ కె.కృష్ణవేణి, డిఎల్‌డిఒ కెసిహెచ్.అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి మల్లికార్జునరావు, డిఎంహెచ్ఒ డి.మహేశ్వరరావు పాల్గొన్నారు.

రిలయన్స్ ఫౌండేషన్ ఉపకార వేతనాలకు శ్రీవాసవి విద్యార్థులు

తాడేపల్లిగూడెం :తాడేపల్లిగూడెం శ్రీ వాసవి ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ ప్రథమ సంవత్సరం చదువుతున్న ముగ్గురు విద్యార్థినులు ప్రతిష్టాత్మక రిలయన్స్ ఫౌండేషన్ సంస్థ అందించే ఉపకార వేతనాలకు ఎంపికైనట్లు కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు గ్రంధి సత్యనారాయణ, చలంచర్ల సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశవ్యాప్తంగా సుమారు 90 వేల మంది విద్యార్థులు రిలయన్స్ ఫౌండేషన్ సంస్థ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోగా వారికి ఆన్‌లైన్ ద్వారా పరీక్ష పెట్టి దానిలో ఉత్తీర్ణులైన 4500 మంది విద్యార్థులను ఎంపిక చేసి నాలుగేళ్ల కోర్సుకు ఒక్కొక్కరికి రూ.2 లక్షల ఉపకార వేతనం మంజూరు చేసి సంవత్సరానికి రూ.50 వేల చొప్పున నాలుగేళ్లకు రూ.2 లక్షలు నేరుగా విద్యార్థుల బ్యాంకు ఖాతాకు జమ చేస్తుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రత్నాకరరావు తెలిపారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

ప్రజాశక్తి - భీమవరం

విద్యార్థులలో క్రీడల పట్ల మక్కువ పెంచేందుకు క్రీడా సామగ్రి దోహదపడుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. స్థానిక కలెక్టరేట్ రాష్ట్ర క్రీడా సాధికారిక సంస్థ (శాప్) విజయవాడ డిఎస్ఎ ద్వారా పంపిణీ చేసిన రూ.3 లక్షల విలువైన క్రీడా సామగ్రిని సంస్థ బోర్డ్ డైరెక్టర్ కర్రి విజయలక్ష్మికి కలెక్టర్ అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ ఈ క్రీడా సామగ్రిని తాడేపల్లిగూడెం అసెంబ్లీ నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల్లో, వెనుకబడిన ప్రాంతాల్లో ఉన్నవారికి పంపిణీ చేయాలని బోర్డు డైరెక్టర్ విజయలక్ష్మికి కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అథారిటీ చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి ఎమ్‌డి హెచ్.మెహర్‌రాజ్, జిల్లా చీఫ్ కోచ్ రమేష్‌బాబు, భాస్కరరావు పాల్గొన్నారు.

పాఠశాలలో దంత వైద్య శిబిరం

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

గవర్నర్, ఎంజెఎఫ్ లయన్ గట్టిం మాణిక్యాలరావు పుట్టినరోజు సందర్భంగా తాడేపల్లిగూడెం డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ కొప్పిశెట్టి రమణయ్య ఆధ్వర్యంలో స్మై మల్టి స్పెషల్టీ హాస్పటల్ వారి సహకారంతో శనివారం స్థానిక బాలికల పాఠశాలలో ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని డివైఇఒ రవీంద్రభారతి ప్రారంభించారు. లయన్ డాక్టర్ కె.కమల వారి సిబ్బంది వైద్య సేవలందించారు. ఈ కార్యక్రమనికి అతిథులుగా విచ్చేసిన మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్, జోనల్ మాజీ ఛైర్మన్ లయన్ గమిని సుబ్బారావు, జోనల్ ఛైర్మన్ లయన్ పేరిచెర్ల మురళికృష్ణంరాజు మాట్లాడారు. లయన్ మద్దూకూరి మెహర్‌ప్రసాద్, లయన్ మునగాల జితేంద్ర విద్యార్థులకు స్నాక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమలో డైమండ్స్ లయన్స్ శ్రీనివాస్, పట్నాల రామకృష్ణ కుమార్, చిక్కాల భ్రమరాంబికా పాల్గొన్నారు.

మొగల్తూరు : కాశీపట్నం పరమర హెర్మోన్ లివింగ్ వాటర్ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఆ సంస్థకు చెందిన పాఠశాలలో శనివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సంస్థ ఛైర్మన్ జోసెఫ్‌రాజు, స్వర్ణగీత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత పేద ప్రజలకు వైద్య సేవలందించడమే లక్ష్యంగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. శస్త్రచికిత్సలు అవసరమైన వారికి ఉచితంగా చేయిస్తామన్నారు. 400 మందిని పరీక్షించగా 190 మందికి కళ్లజోళ్లు అవసరమని గుర్తించామన్నారు. 20 మందికి నేత్ర శస్త్ర చికిత్సల అవసరమన్నారు.

విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాలి

ప్రజాశక్తి - కాళ్ల

ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో నైపుణ్యం పెంపొందించాలని కాళ్ల ఎంఇఒలు ఎ.రవీంద్ర, జి.కనకరాజు అన్నారు. మండలంలోని వేంపాడు గ్రామంలో ప్రాథమిక పాఠశాల (హిందూ) ఉయ్ లవ్ రీడింగ్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒలు రవీంద్ర, కనకరాజు మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అనేక సౌకర్యాలు కల్పిస్తుందన్నారు. విద్యార్థులు రీడింగ్, రైటింగ్‌లో నైపుణ్యం పెంపొందించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లిదండ్రులకు సూచించారు. ఈ సౌకర్యాలు ఉపయోగించుకుని పిల్లలు బాగా చదవాలన్నారు. అందరికీ చదవడం, రాయడం వచ్చేవిధంగా ఉపాధ్యాయులు తర్ఫీదు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచి యిర్రింకి పద్మావతి, మాజీ సర్పంచి వీరమల్లు మోహన్‌రావు (బోస్), ప్రధానోపాధ్యాయులు మురళి, సుబ్బరాజు, ఉపాధ్యాయులు రవికుమార్ రాజు, కిషోర్, వరలక్ష్మి, స్వామి, సత్యనారాయణ, సుబ్బారావు, పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'పవన్ మాటలను వక్రీకరిస్తున్న వైసిపి'

ఉండి :వాలంటీర్ వ్యవస్థలో లోపాలే ప్రధాన లక్ష్యంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఏలూరు వారాహి సభలో మాట్లాడారని, దానిని వైసిపి నాయకులు వక్రీకరించారని జనసేన పార్టీ ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి జుత్తిగ నాగరాజు అన్నారు. ఉండి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా ఉన్న గాంధీ విగ్రహానికి జుత్తిగ నాగరాజు శనివారం పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధికారం చేపట్టగానే రెండు లక్షల ఉద్యోగాలను భర్తీ చేస్తామని, జాబ్ క్యాలెండర్ విడుదల చేసి నిరుద్యోగ సమస్య లేకుండా చేస్తామని బూటకపు హామీలు ఇచ్చిన జగన్ యువతను మోసం చేశారన్నారు. ఇదే విషయాన్ని పవన్‌కల్యాణ్ ఏలూరు సభలో చెబుతూ కేవలం రూ.ఐదు వేల వేతనంతో యువతకు భవిష్యత్తు లేకుండా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్నారని విమర్శించారన్నారు. డేటా సేకరిస్తున్న కొందరు వాలంటీర్లను ఉద్దేశించి మాట్లాడారే తప్ప స్వచ్ఛందంగా నిజాయితీగా సమాజ సేవ చేసే వాలంటీర్లను అగౌరవపరిచేలా మాట్లాడలేదన్న విషయాన్ని వాలంటీర్లందరూ గుర్తించాలని వారు కోరారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : వైసిపి

ప్రజాశక్తి - ఉండి

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని డిసిసిబి ఛైర్మన్ పివిఎల్.నరసింహరాజు అన్నారు. మండలంలోని యండగండి 1, 2 సచివాలయాల పరిధిలో గ్రామ సర్పంచి గోగులమండ చిన్నకృష్ణమూర్తి అధ్యక్షతన నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పివిఎల్.నరసింహరాజు హాజరయ్యారు. అర్హులకు ధ్రువీకరణ పత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షులు ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, మండల పరిషత్ సహ ఉపాధ్యక్షురాలు దత్తాల సుజాత రాణి, కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, నాయకులు పాల్గొన్నారు.

పెనుమంట్ర : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు అన్నారు. మండలంలోని జుత్తిగ, నత్తా రామేశ్వరం గ్రామాల్లో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జుత్తిగ సర్పంచి తమనంపూడి వీర్రెడ్డి, నత్తా రామేశ్వరం సర్పంచి వెలగల ధర్మారెడ్డి, గరువు సర్పంచి ముదునూరి నాగరాజు, ఎఎంసి ఛైర్మన్ వెలగల వెంకటరమణ (మిస్సమ్మ), ఎంపిపి కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసురెడ్డి), ఎంపిటిసి సభ్యులు మాంద్ర శాంతకుమారి, తహశీల్దార్ దండు అశోక్ వర్మ, ఎంపిడిఒ వి.పూర్ణబాబ్జి పాల్గొన్నారు.

గణపవరం : క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారం కోసమే జగనన్న సురక్ష కార్యక్రమం చేపట్టినట్లు ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని అర్ధవరం, చిలకపాడు గ్రామాల్లో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సభలకు ఆయా గ్రామ సర్పంచులు చుక్క అప్పారావు, గాతల సుజాత అధ్యక్షత వహించారు. స్థానికులకు ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి దండు వెంకట రామరాజు, ఎంపిడిఒ జి.జ్యోతిర్మయి, తహశీల్దార్ లక్ష్మి, ఇఒపిఆర్‌డి సత్యనారాయణ పాల్గొన్నారు.

పోడూరు : మండలంలోని పి.పోలవరం, కవిటం గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంఎల్ఎ శ్రీరంగనాథ రాజు, రుడా ఛైర్మన్ షర్మిల రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు కొత్తగా మంజూరైన ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్ర మంలో జెడ్‌పిటిసి సభ్యులు గుంటూరు పెద్దిరాజు, ఎంపిపి సుమంగళి సాగర్, తహశీల్దార్ ఆర్‌వి.కృష్ణారావు, ఎంపిడిఒ డి.సుహాసిని, పాల్గొన్నారు.


పెనుమంట్ర మండలంలో...

భీమవరం రూరల్ : భీమవరంలోని ఏడో వార్డు, 19వ వార్డు సచివాలయాల వద్ద జరిగిన జగనన్న సురక్ష సభల్లో ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా గడపగడపకు ప్రభుత్వ పాలనను చేరువ చేసేందుకే సిఎం జగన్ వాలంటీర్ వ్యవస్థను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లను పంపిణీ చేశారు.

వీరవాసరం : మండలంలోని వీరవాసరం, రాయకుదురు గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ గ్రంధి శ్రీనివాస్ మాట్లాడుతూ అర్హులందరికీ లబ్ధి చేకూరాలన్న లక్ష్యంతో జగనన్న సురక్ష కార్యక్రమం ప్రవేశపెట్టినట్లు చెప్పారు. అనంతరం అవసరమైనవారికి ధ్రువపత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు చికిలే మంగతాయారు, గెడ్డం భారతీభాస్కరరావు, ఎఎంసి ఛైర్మన్ కోటిపల్లి బాబు, వ్యవసాయ సలహామండలి ఛైర్మన్ గొలగాని సత్యనారాయణ, తహశీల్దార్ సుందరరాజు, ఎంపిడిఒ జ్యోతి, ఎంపిటిసి సభ్యులు బోను జోత్స్నదేవి, వీరవల్లి ఉషారాణి, కడలి ధర్మారావు, నూకల కనకారావు, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

మొగల్తూరు : మండలంలోని కొత్తోట, కొత్తపాలెం సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు హాజరై మాట్లాడారు. కాళీపట్నం జమీందారి భూమల సమస్యను త్వరలో పరిష్కరిస్తామన్నారు.

ఆచంట : మండలంలోని వల్లూరు గ్రామంలో ఎఎంసి ఛైర్మన్ లావణ్య అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎల్ఎ శ్రీరంగనాథరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రాజమండ్రి రుడా ఛైర్మన్, ఆచంట నియోజకవర్గ పరిశీలకురాలు మేడపాటి షర్మిలారెడ్డి, ఎంపిటిసి సభ్యులు ఏడిద రామలక్ష్మి, ఎంపిడిఒ జగన్నాథరావు, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

కాళ్ల : ప్రజల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుందని మండల ప్రత్యేకాధికారి కె.కిషోర్‌కు మార్ అన్నారు. బొండాడ, ఏలూరుపాడు-1 సచివాలయాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు.

పెనుగొండ : మండలంలోని సిద్ధాంతం గ్రామంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంఎల్ఎ చెరుకువాడ శ్రీరంగనాథరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆచంట నియోజకవర్గ పరిశీలకుకురాలు, రాజమండ్రి ఉడా ఛైర్మన్ షర్మిలారెడ్డి పాల్గొన్నారు.

టిడిపి బస్సు యాత్ర జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఆచంట

ఈ నెల 16వ తేదీ ఆదివారం సాయంత్రం నాలుగు గంటలకు టిడిపి ఆధ్వర్యంలో నిర్వహించనున్న భవిష్యత్తుకు గ్యారెంటీ చైతన్య యాత్రను విజయవంతం చేయాలని టిడిపి మండల అధ్యక్షులు కేతా మీరయ్య పిలుపునిచ్చారు. శనివారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారంటీ చైతన్య యాత్ర ఆచంట మార్కెట్ యార్డ్ నుంచి ప్రారంభమవుతుందని, యాత్రను టిడిపి బ్యూరో సభ్యులు, మాజీ మంత్రి పితాని సత్యనారాయణ జెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. యాత్ర ఆచంట నుంచి, ముళ్లపర్రు, సిద్ధాంతం, వడలి, పెనుగొండ మీదుగా పెనుమంట్ర మండలం మార్టేరుకు చేరుకుంటుందని, అక్కడ భారీ బహిరంగ సభ జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు, అభిమానులు, శ్రేయోభిలాషులు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

వారాహి యాత్ర విజయవంతం : జనసేన

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

వారాహి రెండో దశ యాత్ర విజయవంతమైందని జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. యాత్ర విజయవంతం చేసినందుకు ప్రతిఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జనసేన పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పవన్‌కల్యాణ్ రాజకీయ విలువల గురించి మాట్లాడుతుంటే వైసిపి నేతలు ఆయన తల్లి, ఇంట్లో ఆడవాళ్ల గురించి మాట్లాడుతున్నారన్నారు. అనంతరం పెంటపాడు మండల వీర మహిళ అధ్యక్షులు పెనుబోతుల సోమలమ్మ, తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ అధ్యక్షులు వేజ్జు రత్నకుమారి, తాడేపల్లిగూడెం పట్టణ కమిటీ అధ్యక్షులు వర్తనపల్లి కాశి, లైజనింగ్ కమిటీ సభ్యులు, సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, సోషల్ మీడియా సభ్యులు, వీర మహిళలు జనసేన నాయకులు జనసైనికులందరు కలిసి బొలిశెట్టి శ్రీనివాస్‌ని సన్మానించారు.